ఇందిరమ్మ ఇల్లు లేని ఊరు లేదు

- పేద ప్రజల అభ్యున్నతికి పాటుపడ్డారు..
- ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్


వేములవాడలో ఇందిరాగాంధీ చిత్రపటానికి నివాళి అర్పిస్తున్న ప్రభుత్వ విప్ శ్రీనివాస్, నాయకులు

వేములవాడ అర్బన్: మన దేశంలో ఇందిరమ్మ ఇల్లు లేని ఊరు లేదని ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ అన్నారు. మాజీ ప్రధాని ఇందిరాగాంధీ వర్ధంతి సందర్భంగా గురువారం వేములవాడ పట్టణంలోని మహంకాళి చౌరస్తా వద్ద ఆమె చిత్రాపటానికి పూలమాల వేసి, నివాళి అర్పించారు. ఇందిరాగాంధీ దేశానికి ఎంతో సేవ చేశారని, పేద ప్రజల అభ్యున్నతికి పాటుపడ్డారని కొనియాడారు. బ్యాంకుల జాతీయీకరణ, పేదలకు భూముల పంపిణీ వంటి ఎన్నో సంక్షేమ కార్యక్రమాలు చేపట్టారన్నారు. రాష్ట్రంలో నియోజకవర్గానికి 3,500 ఇందిరమ్మ ఇళ్లకు బీసీలకు రూ.5 లక్షలు, ఎస్సీ, ఎస్టీలకు రూ.6 లక్షలు మంజూరు చేస్తున్నట్లు పేర్కొన్నారు. కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు చంద్రగిరి శ్రీనివాస్, మున్సిపల్ వైస్ చైర్మన్ బింగి మహేశ్, నాయకులు రమేశ్, కొమురయ్య, రాజు, మధు తదితరులున్నారు.

కోనరావుపేట: మండల కేంద్రంలో గురువారం మాజీ ప్రధాని ఇందిరాగాంధీ వర్ధంతి నిర్వహించారు. కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు షేక్ ఫిరోజ్ పాషా, నాయకులు గోపాల్, ఎల్లయ్య, శంకర్, శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

ఎల్లారెడ్డిపేట: మాజీ ప్రధాని ఇందిరాగాంధీ పేదల ఆకలి తీర్చారని, ఆమె సేవలు మరువలేనివని బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు దొమ్మాటి నర్సయ్య అన్నారు. ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంలో గురువారం ఆమె చిత్రపటానికి నివాళి అర్పించారు. ఏఎంసీ చైర్మన్ సాబేరా బేగం, వైస్ చైర్మన్ గుండాడి రాంరెడ్డి, మండల అధ్యక్షుడు సద్ది లక్ష్మారెడ్డి, నాయకులు రాజయ్య, గౌస్, గిరిధర్‌రెడ్డి, మల్లారెడ్డి, రవి తదితరులు పాల్గొన్నారు.

రుద్రంగి: మండల కేంద్రంలోని ఇందిరా గాంధీ విగ్రహానికి కాంగ్రెస్ నాయకులు గురువారం పూలమాలలు వేసి, నివాళి అర్పించారు. డీసీసీ కార్యదర్శులు చెలుకల తిరుపతి, తర్రె లింగం, గడ్డం శ్రీనివాస్ రెడ్డి, పార్టీ మండల ఉపాధ్యక్షుడు తర్రె మనోహర్, గ్రామ శాఖ అధ్యక్షుడు సామ మోహన్ రెడ్డి, నాయకులు పాల్గొన్నారు.

బోయినపల్లి: మండల కేంద్రంలోని అంబేద్కర్ చౌరస్తాలో గురువారం మాజీ ప్రధాని ఇందిరాగాంధీ వర్ధంతి నిర్వహించారు. కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు వన్నెల రమణారెడ్డి, ఏఎంసీ చైర్మన్ బోయిని ఎల్లేశ్‌యాదవ్, నాయకులున్నారు.

ముస్తాబాద్: మాజీ ప్రధాని ఇందిరాగాంధీ వర్ధంతిని గురువారం ముస్తాబాద్‌లో నిర్వహించారు. కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు యెల్ల బాల్‌రెడ్డి, ఏఎంసీ వైస్ చైర్మన్ వెల్ముల రాంరెడ్డి, పట్టణ అధ్యక్షుడు గజ్జెల రాజు, నాయకులు శ్రీనివాస్, నర్సింలు, రాజేశం, మహేశ్‌రెడ్డి, మధు, ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు.

చందుర్తి: మాజీ ప్రధాని ఇందిరాగాంధీ దేశానికి చేసిన సేవలు మరువలేనివని కాంగ్రెస్ చందుర్తి మండల అధ్యక్షుడు చింతపంటి రామస్వామి అన్నారు. ఇందిరాగాంధీ వర్ధంతి సందర్భంగా మండల కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో గురువారం ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి, నివాళి అర్పించారు. జెడ్పీటీసీ మాజీ సభ్యుడు నాగం కుమార్, నాయకులు బొజ్జ మల్లేశం, దారం చంద్రం, బానాల రవీందర్‌రెడ్డి, గొట్టె ప్రభాకర్, ఈసరి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

తంగళ్లపల్లి: మాజీ ప్రధాని ఇందిరాగాంధీ వర్ధంతి సందర్భంగా గురువారం తంగళ్లపల్లిలోని ఆమె విగ్రహానికి కాంగ్రెస్ నాయకులు నివాళి అర్పించారు. పార్టీ మండల అధ్యక్షుడు ప్రవీణ్ జే టోని, ఉపాధ్యక్షుడు శ్రీకాంత్ గౌడ్, ఏఎంసీ వైస్ చైర్మన్ నేరెళ్ల నర్సింగం గౌడ్, పద్మశాలీ సంఘం అధ్యక్షుడు రాపెల్లి ఆనందం, మైనార్టీ అధ్యక్షుడు ఇక్బాల్, యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు చుక్క రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.


రుద్రంగిలో క్రాకర్స్ కాలుస్తున్న ఓ కుటుంబం


బోయినపల్లిలో...

ఘనంగా దీపావళి వేడుకలు

జిల్లా వ్యాప్తంగా ప్రజలు దీపావళి వేడుకలను గురువారం ఘనంగా జరుపుకున్నారు. ఇళ్లు, వ్యాపార సముదాయాలను దీపాలతో అలంకరించారు. పలు గ్రామాల్లోని ఆలయాల్లో పూజలు జరిగాయి. వ్యాపారులు తమ దుకాణాల్లో లక్ష్మీపూజ నిర్వహించారు. రాత్రి టపాసుల మోత, చిచ్చుబుడ్ల వెలుగు, దూసుకెళ్లే రాకెట్లు, భూచక్రాల భ్రమణల మధ్య సంబరాలు అంబరాన్నంటాయి. చిన్నాపెద్ద తేడా లేకుండా టపాసులు కాలుస్తూ సందడి చేశారు. కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా క్యాంప్ ఆఫీసులో వేడుకలు నిర్వహించారు. శుక్రవారం వ్రతాలు, నోములు చేసుకున్నవారి ఇళ్లు సందడిగా కనిపించాయి.

– సాక్షి నెట్‌వర్క్

అకాల వర్షం.. తడిసిన ధాన్యం


జిల్లెల్లలో తడిసిన ధాన్యం


తడిసిన ధాన్యం చూపిస్తున్న రైతులు

తంగళ్లపల్లి: మండలంలోని జిల్లెల్ల గ్రామంలో శుక్రవారం కురిసిన అకాల వర్షానికి కొనుగోలు కేంద్రంలో ఆరబోసిన వరి ధాన్యం తడిసింది. దీంతో పలువురు రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. కొనుగోళ్లు త్వరగా ప్రారంభించాలని, తడిసిన ధాన్యాన్ని కూడా కొనుగోలు చేయాలని కోరారు.

కొనుగోళ్లు వెంటనే చేపట్టాలి

ధాన్యం కొనుగోళ్లను వెంటనే చేపట్టాలని సిరిసిల్ల సింగిల్‌విండో డైరెక్టర్ బండి దేవేందర్‌యాదవ్ డిమాండ్ చేశారు. శుక్రవారం గండిలచ్చపేట, ఓబులాపూర్ గ్రామాల్లో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాలను పరిశీలించారు. కాంగ్రెస్ ప్రభుత్వం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించి, ధాన్యం కొనడం లేదని ఆరోపించారు. దీంతో రైతులు తక్కువ ధరకు రైస్‌మిల్లులకు అమ్ముకుంటున్నారని పేర్కొన్నారు.

చందుర్తి: వరి ధాన్యాన్ని రైతులు కొనుగోలు కేంద్రాలకు తరలించి నెల రోజులవుతోందని, కొనుగోళ్లు వెంటనే ప్రారంభించాలని బీఆర్ఎస్ చందుర్తి మండల అధ్యక్షుడు మ్యాకల ఎల్లయ్య డిమాండ్ చేశారు. మండల కేంద్రంలో శుక్రవారం ఆయన మాట్లాడారు. అకాల వర్షాలతో రైతులు ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. కొనుగోళ్లు ప్రారంభించకపోతే వారితో కలిసి ధర్నాలు చేస్తామని హెచ్చరించారు.

గంభీరావుపేట: మండలంలోని కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం కొనుగోళ్లను అధికారులు వెంటనే చేపట్టాలని రైతులు డిమాండ్ చేశారు. అకాల వర్షానికి ముస్తఫానగర్ కేంద్రంలో తడిసిన ధాన్యాన్ని శుక్రవారం చూపిస్తూ మాట్లాడారు. కొనుగోళ్లు జరగకపోవడం, వర్షాల భయంతో ధాన్యం విక్రయించేందుకు దళారులను ఆశ్రయించాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు.

‘ధాన్యం తడవకుండా చూసుకోండి’


కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న చైర్మన్ తిరుపతిరెడ్డి, నాయకులు

వేములవాడరూరల్: రైతులకు సహకార సంఘాలు అండగా ఉంటాయని ప్యాక్స్ చైర్మన్, కేడీసీసీ బ్యాంకు డైరెక్టర్ ఏనుగు తిరుపతి రెడ్డి అన్నారు. వేములవాడ రూరల్ మండలంలోని లింగంపల్లి, బొల్లారం, హన్మాజీపేట గ్రామాల్లో ఏర్పాటు చేసిన వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను శుక్రవారం ప్రారంభించారు. ప్యాక్స్ ఆధ్వర్యంలో ప్రతీ గ్రామంలో కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేశామన్నారు. వర్షాలు కురుస్తున్నందున వరి ధాన్యం తడవకుండా చూసుకోవాలని రైతులకు సూచించారు. టార్పాలిన్లు అందిస్తున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో వైస్ చైర్మన్ లక్ష్మీకాంతారావు, డైరెక్టర్లు సురేందర్, సంజీవ్ రెడ్డి, ప్యాక్స్ సెక్రటరీ లక్ష్మణ్, నాయకులు సామ తిరుపతి రెడ్డి, శ్రీనివాస్ రెడ్డి, లచ్చయ్య, రైతులు పాల్గొన్నారు.

కొనుగోలు కేంద్రం ప్రారంభం

రుద్రంగి: మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని శుక్రవారం ప్రారంభించారు. కేంద్రం సిబ్బంది మాట్లాడుతూ.. ధాన్యాన్ని ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లోనే విక్రయించి, మద్దతు ధర పొందాలని రైతులకు సూచించారు.

భావ కవిత్వానికి ఆద్యుడు కృష్ణశాస్త్రి


మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ విజయలక్ష్మి

గంభీరావుపేట: స్థానిక ప్రభుత్వ డిగ్రీ, పీజీ కళాశాలలో తెలుగు విభాగం ఆధ్వర్యంలో శుక్రవారం ప్రముఖ కవి దేవులపల్లి కృష్ణశాస్త్రి జయంతి నిర్వహించారు. ప్రిన్సిపాల్ విజయలక్ష్మి మాట్లాడుతూ.. తెలుగులో భావ కవిత్వానికి కృష్ణశాస్త్రి ఆద్యుడని చెప్పారు. మేఘ సందేశం, గోరింటాకు, కార్తీక దీపం వంటి సినిమాలకు పాటలు రాశారని తెలిపారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ ప్రభాకర్, తెలుగు విభాగం అధ్యాపకులు దీపిక, భార్గవి, ఐక్యూసీ కో–ఆర్డినేటర్ ఆంజనేయులు, టాస్క్ కన్వీనర్ శ్రవణ్, ఉమెన్ ఎంపవర్‌మెంట్ సెల్ కన్వీనర్ వాణి, అధ్యాపకులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలకు ఎంపిక


అభినందిస్తున్న కరస్పాండెంట్, ప్రిన్సిపాల్, టీచర్లు

సిరిసిల్ల అర్బన్: పట్టణంలోని సిద్ధార్థ ఇంగ్లిష్ మీడియం స్కూల్ విద్యార్థినులు రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలకు ఎంపికైనట్లు కరస్పాండెంట్ నాగుల సంతోష్‌గౌడ్ తెలిపారు. గత నెల 27న ఉమ్మడి కరీంనగర్ జిల్లాస్థాయి అండర్–17 బాలికల విభాగంలో కె.స్నేహ, బి.శ్రీనిధి సత్తా చాటారన్నారు. ఈ నెల 3 నుంచి 5వ తేదీ వరకు మహబూబ్‌నగర్ జిల్లా రాచర్లలో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటారన్నారు. శుక్రవారం పాఠశాలలో వారిని అభినందించారు. ప్రిన్సిపాల్ బిజ్జు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి హ్యాండ్‌బాల్ పోటీలకు..


జిగిష

సిరిసిల్ల పట్టణంలోని కృష్ణవేణి టాలెంట్ స్కూల్ విద్యార్థిని కె.జిగిష రాష్ట్రస్థాయి సబ్ జూనియర్ హ్యాండ్‌బాల్ పోటీలకు ఎంపికైనట్లు కోచ్ కృష్ణహరి తెలిపారు. గత నెల 29న కొత్తపల్లిలో జరిగిన సబ్ జూనియర్స్ బాలికల విభాగం పోటీల్లో ప్రతిభ కనబరిచినట్లు పేర్కొన్నారు. ఈ నెల 2 నుంచి 4వ తేదీ వరకు ఆసిఫాబాద్ జిల్లాలో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటుందన్నారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కులు అందజేత

చందుర్తి: మూడపల్లిలో ఐదుగురికి రూ.2.74 లక్షల విలువైన సీఎంఆర్ఎఫ్ చెక్కులను కిసాన్ సెల్ చందుర్తి మండల అధ్యక్షులు బానాల రవీందర్‌రెడ్డి శుక్రవారం అందించారు. సింగిల్‌విండో వైస్ చైర్మన్ పుల్కం మోహన్, డైరెక్టర్ పుల్కం లచ్చయ్య, మాజీ సర్పంచ్ ఏసుదాసు, నాయకులు పాల్గొన్నారు.

కుటుంబ సర్వేకు సహకరించాలి


కోనరావుపేటలో పరిశీలిస్తున్న ఆర్డీవో రాజేశ్వర్


ఎల్లారెడ్డిపేటలో పోస్టర్ అంటిస్తున్న అధికారులు

కోనరావుపేట: మండలంలోని నిమ్మపల్లి, కోనరావుపేట గ్రామాల్లో ఎన్యుమరేటర్లు శుక్రవారం ఇంటింటికీ వెళ్లారు. తమకు కేటాయించిన ఇంటి నంబర్లను పరిశీలించారు. ఇళ్ల గోడలకు ఇంటింటి కుటుంబ సర్వేకు సంబంధించిన పోస్టర్లు అంటించారు. ఈ సందర్భంగా కోనరావుపేటలో వేములవాడ ఆర్డీవో రాజేశ్వర్ ప్రజల సామాజిక, ఆర్థిక పరిస్థితులు, విద్య, ఉపాధి, కులం తదితర వివరాల సేకరణపై అధికారులకు పలు సూచనలు చేశారు. ఈ నెల 6వ తేదీ నుంచి నిర్వహించే కుటుంబ సర్వేకు ప్రజలు సహకరించాలని కోరారు. ఆయన వెంట తహసీల్దార్ విజయ్‌ప్రకాశ్‌రావు, ఎంపీవో ఆరిఫ్ పాషా, ఆర్ఐ రాజశేఖర్ తదితరులున్నారు.

ఇల్లంతకుంట: మండలంలోని వివిధ గ్రామాల్లో ఇంటింటా సమగ్ర సర్వే కోసం ఎన్యుమరేటర్లు ఇంటింటికీ వెళ్తున్నారు. శుక్రవారం తమకు కేటాయించిన ఇంటి నంబర్లను పరిశీలించి, సంబంధిత పోస్టర్లను గోడలకు అతికించారు. కుటుంబ సర్వేకు అవసరమైన పత్రాలు సిద్ధంగా ఉంచుకోవాలని ప్రజలకు సూచించారు. ఈ నెల 6వ తేదీ నుంచి సర్వే ప్రారంభమవుతుందని తహసీల్దార్ ఎం.ఏ.ఫరూక్, ఎంపీడీవో శశికళ తెలిపారు.

వేములవాడరూరల్: మండలంలోని బాలరాజుపల్లి, వెంకటాంపల్లి తదితర గ్రామాల్లో ఎన్యుమరేటర్లు శుక్రవారం ఇంటింటికీ వెళ్లారు. తహసీల్దార్ సుజాత, ఎంపీడీవో శ్రీనివా స్, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

ఎల్లారెడ్డిపేట: ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వేకు ప్రజలు సహకరించాలని తహసీల్దార్ రామచంద్రం, ఎంపీడీవో సత్తయ్య కోరారు. ఎన్యుమరేటర్లు శుక్రవారం ఎల్లారెడ్డిపేట మండలంలోని ఇంటింటికీ వెళ్లారు. సర్వేకు సంబంధించిన స్టిక్కర్లను ఇళ్ల గోడలకు అతికించారు. పంచాయతీ కార్యదర్శులు, అంగన్‌వాడీ టీచర్లు తదితరులు పాల్గొన్నారు.

వీర్నపల్లి: రంగంపేటలో ఎన్యుమరేటర్లకు మండల ప్రత్యేక అధికారి జి.నర్సింహులు శుక్రవారం పలు సూచనలు చేశారు. తహసీల్దార్ మారుతి రెడ్డి, ఎంపీవో వాజిద్, ఆర్ఐ ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

ముస్తాబాద్: కులగణన పారదర్శకంగా చేపట్టాలని మండల ప్రత్యేకాధికారి, నోడల్ ఆఫీసర్ లత అన్నారు. ఆమె శుక్రవారం ముస్తాబాద్ మండలంలోని తుర్కపల్లిలో పర్యటించారు. ప్రస్తుతం ఇళ్ల వివరాలు నమోదు చేస్తున్నామని, ఈ నెల 6 నుంచి 128 మంది ఎన్యుమరేటర్లు, 14 మంది సూపర్‌వైజర్లతో ఇంటింటా సర్వే ఉంటుందన్నారు. అధికారులు, ఉద్యోగులు సర్వేను విజయవంతం చేయాలని సూచించారు.

వేములవాడ సమాచారం



వేములవాడ రాజన్న సన్నిధిలో శుక్రవారం సాయంత్రం 4 గంటల వరకు వసతి గదుల సమాచారం.

కాంప్లెక్స్ పేరు	ఖాళీల సంఖ్య	అద్దె రూ.
అమ్మవారి కాంప్లెక్స్	04	1,680
భీమేశ్వర సదన్ ఏసీ	08	1,344
భీమేశ్వర సదన్ సూట్స్	06	1,680
భీమేశ్వర గెస్ట్‌హౌస్	06	2,800
నందీశ్వర కాంప్లెక్స్ ఏసీ	05	1,008
నందీశ్వర నాన్‌ఏసీ	07	560
నందీశ్వర సూట్స్	04	2,800
లక్ష్మీగణపతి కాంప్లెక్స్	06	448
పార్వతీపురం స్పెషల్	10	672
పార్వతీపురం సాధారణ	10	336

- వేములవాడ

వల్లభాయ్ పటేల్ జయంతి


నివాళి అర్పిస్తున్న కలెక్టర్, అధికారులు

సిరిసిల్ల: మాజీ ఉప ప్రధాని వల్లభాయ్‌పటేల్ జయంతిని కలెక్టరేట్‌లో ఘనంగా నిర్వహించారు. కలెక్టర్ సందీప్‌కుమార్‌ఝా, డీవైఎస్‌వో అజ్మీరా రాందాస్, డీఎంహెచ్‌వో వసంతరావు, లీడ్‌బ్యాంక్ మేనేజర్ మల్లికార్జున్, ఏపీఆర్వో రవి పాల్గొన్నారు.

ఏఎంసీల చైర్మన్లకు సన్మానం


చైర్మన్ ఎల్లేశ్‌యాదవ్, డైరెక్టర్లను సన్మానిస్తున్న లచ్చయ్య, నాయకులు

బోయినపల్లి: బోయినపల్లి ఏఎంసీ చైర్మన్ బోయిని ఎల్లేశ్‌యాదవ్, వైస్ చైర్మన్ వినోద్‌రెడ్డి, డైరెక్టర్లు గుడి శేఖర్‌రెడ్డి, గంగిపెల్లి లచ్చయ్య, కల్లెపెల్లి సతీశ్, మెరుపుల మహేశ్, అద్దంకి రమేశ్, రోమాల అజయ్‌లను కాంగ్రెస్ జిల్లా కార్యదర్శి కట్ట లచ్చయ్య గురువారం సన్మానించారు. పార్టీ మండల అధ్యక్షుడు వన్నెల రమణారెడ్డి తదితరులున్నారు. అలాగే, బూర్గుపల్లిలో యువకులు సత్కరించారు.

ఎల్లారెడ్డిపేట: నారాయణపూర్ రజక సంఘం ఆధ్వర్యంలో రాచర్లబొప్పాపూర్ మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ సాబేరాబేగంను శుక్రవారం సన్మానించారు. సంఘం గ్రామ అధ్యక్షుడు దొమ్మాటి భూపతి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు దొమ్మాటి నర్సయ్య, నాయకులు రాజయ్య, పర్శరాములు తదితరులున్నారు.

పెద్దమ్మల కులస్తులను ఎస్సీ జాబితాలో చేర్చాలి


మాట్లాడుతున్న నాయకులు

ముస్తాబాద్: పెద్దమ్మల కులస్తులను బీసీ–ఎ నుంచి ఎస్సీ జాబితాలో చేర్చాలని పెద్దమ్మల సంఘం పోతుగల్ గ్రామశాఖ నాయకులు కోరారు. ఈ మేరకు బీసీ కమిషన్ చైర్మన్‌కు శుక్రవారం కరీంనగర్‌లో వినతిపత్రం అందించినట్లు తెలిపారు. సంచార జాతిగా ఉంటున్న తమకు విద్య, ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లేకుండా పోయాయని ఆవేదన వ్యక్తం చేశారు. దుర్భర జీవితాన్ని గడుపుతున్నామని, వెంటనే తమను ఎస్సీలుగా ప్రకటించాలని విన్నవించామని పేర్కొన్నారు. నాయకులు కేశవులు, సమ్మయ్య, పోషయ్య తదితరులున్నారు.

సంక్షిప్త వార్తలు

● 4 నుంచి గోవిందరాజుల అమృతోత్సవాలు

ఎల్లారెడ్డిపేట: మండల కేంద్రంలోని సత్సంగ సదనంలో ఈనెల 4 నుంచి 12 వరకు శ్రీసరస్వతీ గోవిందరాజుల శతజయంతి అమృతోత్సవాలు నిర్వహిస్తున్నట్లు సత్సంగ సదనం అధ్యక్షుడు బ్రహ్మచారి లక్ష్మారెడ్డి తెలిపారు. ఈమేరకు కరపత్రాలను శుక్రవారం బ్రహ్మచారి లక్ష్మారెడ్డి స్వగృహంలో ఆవిష్కరించారు.

● రైతులు అధైర్యపడొద్దు

ఎల్లారెడ్డిపేట: కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం ఆరబోసిన రైతులు అధైర్య పడొద్దని, ప్రభుత్వం వడ్లను కొనుగోలు చేస్తుందని బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు దొమ్మాటి నర్సయ్య తెలిపారు. మండల కేంద్రంలో విలేకరులతో మాట్లాడారు. రైతుల ఆందోళనను ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్, మంత్రి పొన్నం ప్రభాకర్ దృష్టికి తీసుకెళ్లినట్లు తెలిపారు. మిల్లర్లు ధాన్యం అన్‌లోడ్ చేసుకోకపోతే ప్రభుత్వమే కొని గోదాంలకు తరలించే ప్రణాళికను సిద్ధం చేసినట్లు తెలిపారు. నాయకులు సద్ది లక్ష్మారెడ్డి, షేక్ గౌస్, వంగ మల్లారెడ్డి, గుండాటి రాంరెడ్డి, తిరుపతిరెడ్డి, ముండేటి శ్రీనివాస్, గంట చిన్నలక్ష్మి పాల్గొన్నారు.

● కారు బోల్తా

బోయినపల్లి: మండలంలోని నీలోజిపల్లి గ్రామ సమీపంలో గురువారం వేములవాడకు చెందిన వారి కారు బోల్తా పడిందని స్థానికులు తెలిపారు. కారులో మొత్తం ఆరుగురు ఉండగా ఎవరికీ ఎలాంటి గాయాలు కాలేదన్నారు. కరీంనగర్ నుంచి వేములవాడ వైపు వెళ్తుండగా ప్రమాదం జరిగిందని పేర్కొన్నారు.

● కానిస్టేబుల్, హోంగార్డుకు గాయాలు

వీర్నపల్లి: బైక్ అదుపుతప్పి పడిపోయిన ఘటనలో ఇద్దరు కానిస్టేబుళ్లకు గాయాలయ్యాయి. ఈ ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. వివరాల్లోకి వెళ్తే.. కానిస్టేబుల్ రియాజ్, హోంగార్డు మోహన్ మూడు రోజుల క్రితం వీర్నపల్లి మండలంలోని వన్‌పల్లికి పెట్రోలింగ్‌కు వెళ్లారు. తిరిగి వస్తుండగా సీతారాం నాయక్ తండా వద్ద కుక్క అడ్డు రావడంతో బైక్ అదుపుతప్పి, కిందపడ్డారు. మోహన్ కాలు విరగగా, రియాజ్‌కు స్వల్ప గాయాలయ్యాయి. మోహన్ ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు.

● యువకుడికి తీవ్ర గాయాలు

చందుర్తి: రోడ్డు ప్రమాదంలో ఓ యువకుడు తీవ్రంగా గాయపడ్డాడు. స్థానికుల వివరాల ప్రకారం.. చందుర్తి మండలంలోని మర్రిగడ్డకు చెందిన మహమ్మద్ సల్మాన్ గురువారం రాత్రి బైక్‌పై వెళ్తున్నాడు. గ్రామ శివారులో అదుపుతప్పి కిందపడ్డాడు. ఈ ప్రమాదంలో అతని తలకు తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు అంబులెన్స్‌లో వేములవాడ ఆస్పత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు పరిస్థితి విషమంగా ఉందని చెప్పడంతో కుటుంబసభ్యులు కరీంనగర్ తరలించారు.

● మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి

గంభీరావుపేట: కొత్తపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో స్థానిక అడ్డా మిత్ర బృందం ఆధ్వర్యంలో విద్యార్థులకు మత్తు పదార్థాల నియంత్రణపై శుక్రవారం అవగాహన సదస్సు నిర్వహించారు. కరీంనగర్ రూరల్ ఎక్సైజ్ స్టేషన్ ఎస్సై విజయభాస్కర్ మాట్లాడుతూ.. యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలన్నారు. వాటి బారినపడి భవిష్యత్‌ను నాశనం చేసుకోవద్దని సూచించారు. కార్యక్రమంలో హెచ్ఎం వెంకటరామారావు, అడ్డా మిత్ర బృందం సభ్యుడు ప్రమోద్, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

● సీసీ కెమెరాలతో నేరాల నియంత్రణ

ఎల్లారెడ్డిపేట: సీసీ కెమెరాల సహాయంతో నేరాలను నియంత్రించవచ్చని ఎస్సై రమాకాంత్ అన్నారు. ఎల్లారెడ్డిపేట మండలంలోని పోతిరెడ్డిపల్లిలో గ్రామస్తుల సహకారంతో పంచాయతీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కెమెరాలను శుక్రవారం ఆయన ప్రారంభించారు. మండలంలోని అన్ని గ్రామాల్లో ప్రజలు సీసీ కెమెరాల ఏర్పాటు సహకరించాలని కోరారు. పోతిరెడ్డిపల్లి గ్రామస్తులను అభినందించారు.

● ఏబీసీడీ వర్గీకరణ అమలు చేయాలి

చందుర్తి: రాష్ట్ర ప్రభుత్వం ఏబీసీడీ వర్గీకరణ అమలు చేయాలని ఎమ్మార్పీఎస్ జిల్లా కన్వీనర్ ఎలగందుల భిక్షపతి కోరారు. చందుర్తి మండల కేంద్రంలో శుక్రవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ సందర్భంగా మండల అడహక్ కమిటీని ఎన్నుకున్నారు. కమిటీ కన్వీనర్‌గా తర్రె శంకరయ్య, కో–కన్వీనర్లుగా దొబ్బల ఆనంద్, నేదూరి శంకర్, గసికంటి శంకర్, కుమ్మరి లక్ష్మణ్, లింగంపల్లి వెంకటి, లింగంపల్లి శంకర్, గుడిసె రాజు, మల్యాల హరీశ్, మల్లారపు రాములు, కొమ్ము నరేశ్, మల్యాల శ్రీనివాస్ ఏకగ్రీవం ఎన్నుకైనట్లు పేర్కొన్నారు. సమావేశంలో జిల్లా అధ్యక్షుడు ఖానాపూర్ లక్ష్మణ్, రాష్ట్ర నాయకుడు గుండా థామస్, నాయకులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

మంత్రి ‘పొన్నం’ను కలిసిన కాంగ్రెస్ నాయకులు



బోయినపల్లి: రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖల మంత్రి పొన్నం ప్రభాకర్‌ను కాంగ్రెస్ పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు ఏనుగుల కనకయ్య, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు పులి లక్ష్మీపతి, మాజీ సర్పంచు సంబ లక్ష్మీరాజం గురువారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆయనకు పూల మొక్క అందించారు.

‘ఎమ్మెల్యేపై అసత్య ఆరోపణలు మానుకోవాలి’



ఇల్లంతకుంట: మానకొండూరు ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ, కాంగ్రెస్ నియోజకవర్గ అధికార ప్రతినిధి పసుల వెంకటిలపై బీఆర్ఎస్ నాయకులు అనుచిత వ్యాఖ్యలు చేస్తే సహించేది లేదని కాంగ్రెస్ ఎస్సీ సెల్ ఇల్లంతకుంట మండల అధ్యక్షుడు మచ్చ రాజేశం అన్నారు. మండల కేంద్రంలో శుక్రవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. బీఆర్ఎస్ ఎస్సీ సెల్ మండల అధ్యక్షుడు పసుల బాబు కాంగ్రెస్ నాయకులపై అసత్య ఆరోపణలు చేస్తున్నారని, వాటిని వెంటనే మానుకోవాలని సూచించారు. ఉపాధ్యక్షుడు బదుగు లింగం, నాయకులు పాల్గొన్నారు.

ఇన్‌చార్జి ఎంపీడీవోగా బాధ్యతలు


శంకర్‌రెడ్డి

కోనరావుపేట: మండల ఇన్‌చార్జి ఎంపీడీవోగా గూడ శంకర్‌రెడ్డి శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఇదివరకు పని చేసిన ఎంపీడీవో శ్రీనివాసమూర్తి ఉద్యోగ విరమణ పొందగా సూపరింటెండెంట్‌గా పని చేస్తున్న శంకర్‌రెడ్డికి ఇన్‌చార్జిగా బాధ్యతలు అప్పగించారు.

‘బాణాసంచా విక్రయాలపై అవగాహన కల్పిస్తున్నాం’

ముస్తాబాద్: బాణాసంచా విక్రయాలపై వ్యాపారులు, ప్రజలకు అవగాహన కల్పిస్తున్నామని సిరిసిల్ల ఫైర్‌స్టేషన్ ఆఫీసర్ నరేందర్ ఒక ప్రకటనలో తెలిపారు. ‘సాక్షి’లో నిబంధనలు తుస్ తుస్ శీర్షికన ప్రచురితమైన కథనానికి ఆయన స్పందించారు. దీపావళి సందర్భంగా తమ పరిధిలోని దుకాణాలను సందర్శించామని, ఎవరు నిబంధనలు అతిక్రమించినా చర్యలు తీసుకుంటామన్నారు. లైసెన్స్ లేకుండా బాణాసంచా గోదాములు నిర్వహించొద్దని పేర్కొన్నారు.

నేడు విద్యుత్ అంతరాయం


వేములవాడఅర్బన్: వేములవాడ మున్సిపల్ పరిధి నాంపల్లి సబ్‌స్టేషన్ పరిధిలో మరమ్మతులు చేస్తున్నందున శనివారం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదని సెస్ వేములవాడ అర్బన్ ఏఈ శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. నాంపల్లి, అనుపురం, రుద్రవరం, సంకెపల్లి, ఆరెపల్లి, కొడుముంజ, శాభాష్‌పల్లి, చింతల్‌ఠాణా, అగ్రహారం, చంద్రగిరి, చీర్లవంచ, మారుపాకలకు సరఫరా నిలిపివేస్తున్నట్లు పేర్కొన్నారు.

జాతీయస్థాయి రంగోత్సవ్ రెండో దశకు ఎంపిక



ఎల్లారెడ్డిపేట: మండల కేంద్రంలోని విజ్ఞాన్ పాఠశాల విద్యార్థులు గత నెలలో జరిగిన రంగోత్సవ్ పోటీల్లో జాతీయ స్థాయి రెండో దశకు ఎంపికయ్యారని ఎంఈవో కృష్ణహరి తెలిపారు. మొత్తం 213 మందికి శుక్రవారం గోల్డ్, సిల్వర్, బ్రాంజ్ మెడల్స్‌తోపాటు ప్రశంసాపత్రాలు అందించారు. విద్యార్థులు చదువుతోపాటు అన్ని రంగాల్లో రాణించాలన్నారు. కరస్పాండెంట్ ఎండీ.లతీఫ్, ప్రిన్సిపాల్ శరత్, సంతోష్‌కుమార్, డైరెక్టర్లు నయిమా, అశ్రఫ్, హమీద్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

వృద్ధులకు దుస్తుల పంపిణీ



తంగళ్లపల్లి: మండలంలోని మండెపల్లి ప్రభుత్వ వృద్ధాశ్రమంలోని వృద్ధులకు హైదరాబాద్‌కు చెందిన అడ్వెంట్ ఓవర్సీస్ కంపెనీ ప్రతినిధులు గురువారం కొత్త దుస్తులు పంపిణీ చేశారు. అనంతరం పౌష్టికాహారం అందించారు. విదేశాల్లో చదువుకోవాలనే యువతకు తమ కంపెనీ సహాయ సహకారాలు అందిస్తుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో కంపెనీ డైరెక్టర్ కె.రాజిరెడ్డి, అరవింద్, బీఆర్ఎస్ నాయకులు లింగం తదితరులు పాల్గొన్నారు.